క్లుప్తంగా

ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవరాజు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో పూజారి మారెమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు, కాంట్రాక్టర్ బసవరాజు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి పూజారి మారెమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకై కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కాంట్రాక్టర్ బసవరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్ఫూర్తితో పేద కుటుంబాలకు తోచిన సాయం చేసేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు. పూజారి మారెమ్మ మృతిచెందడంతో కుమారుడు అనాథగా మిగిలాడన్నారు. బాధితా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుర్వ రాజ్, పూజారి చిన్నతిమ్మయ్య, చిన్నఈరన్న, పూజారి హనుమంతు, కొండాపురం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో అనేక ప్రయోజనాలు



హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులతో గ్రూప్‌కమాండర్ అలక్‌త్రిపాఠి

ఆదోని సెంట్రల్: ఎన్‌సీసీతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ అలక్‌త్రిపాఠి తెలిపారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన ఎన్‌సీసీ విద్యార్థులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను, సామాజిక సేవను, ఇతర నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు ఫిజికల్‌గా కూడా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్స్ కలిగిన విద్యార్థులు ప్రభుత్వ, ఆర్మీలలో ఉద్యోగాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో 9ఏ, బీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ జోసెఫ్ ఫిలిప్, 28 ఏబీఎన్ కమాండింగ్ ఆఫీసర్ పీఎస్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, సీనియర్ అధ్యాపకులు అయ్యప్ప, యుగంధర్ రెడ్డి, ఎర్రిస్వామి, ఎన్‌సీసీ ఆఫీసర్ గోవిందు, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ వెంటనే చేయించుకోండి

కోసిగి: రేషన్ కార్డులో ఉన్న లబ్ధిదారులందరూ రేషన్ డీలర్ల వద్ద ఈ–కేవైసీ వెంటనే చేయించుకోవాలని తహసీల్దార్ రుద్రగౌడ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోసిగి మండలంలో 10,747 మంది లబ్ధిదారులుండగా ఇప్పటి వరకు 4,013 మాత్రమే డీలర్ల వద్దకు వెళ్లి ఈ–కేవైసీ చేయించుకున్నారని, ఇంకా 6,734 మంది చేయించుకోలేదన్నారు.

ఎంపీడీఓగా జి.ప్రభావతి



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభావతి

పెద్దకడబూరు : మంత్రాలయం డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న జి.ప్రభావతి పదోన్నతిపై పెద్దకడబూరుకు రెగ్యులర్ ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

పోరాటం చేయక తప్పదు

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ రంగంలో పాలకులు తెచ్చిన సంస్కరణలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేయక తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ఈఈయూ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల్లో భాగంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: అలువాల, పెద్దనెలటూరు, బెళగల్, కంపాడు తదితర గ్రామాల పరిధిలో పంటలకు సాగునీటి సరఫరా చేసే కాలువల సైడ్ గోడల రాళ్లను పెకిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారం ఈమేరకు స్థానిక ఎల్లెల్సీ డీఈ కార్యాలయ అధికారికి వినతి పత్రం ఇచ్చారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: దేశవ్యాప్తంగా ఈనెల 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, తిప్పన్న, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి వెంకప్ప, ఏఐటీయూసీ అధ్యక్షులు భీమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు సమ్మె నోటీసును అందజేశారు.

వైభవంగా గ్రామ దేవరలు

- నాగలదిన్నె, కనకవీడులో ఉత్సవాలు
- నాగలదిన్నెలో 43 ఏళ్ల తరువాత దేవర
- కనుల పండువగా కుంభోత్సవాలు



నాగలదిన్నెలో కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె, కనకవీడు గ్రామాలలో గ్రామ దేవర ఉత్సవం ఉత్సవం వైభవంగా జరిగింది. నాగలదిన్నె గ్రామంలో 43 ఏళ్ల తరువాత చేపట్టిన గ్రామ దేవర ఉత్సవంలో బుధవారం కుంభోత్సవం కనుల పండువగా సాగింది. అలాగే కనకవీడు గ్రామంలో కుంభోత్సవం ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం కుష్మాండ బలిదానం కానిచ్చి, అర్ధరాత్రి భూత వేషధారణలో పొలి మేరలో పొలి చల్లించారు. బుధవారం ఉదయం గ్రామాలలో వేలసిన గ్రామ దేవతలు చిన్నమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, సుంకలమ్మ దేవతలకు భక్తులు బోనాలు సమర్పించారు. బ్యాండు మేళాలు, డప్పుల దరువుల మధ్య సాగిన కుంభోత్సవం భక్తులను ఆకట్టుకుంది. గ్రామస్తులు నూతన వస్త్రాలు ధరించి గ్రామ దేవతలకు కుంభోత్సవం నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో ఉత్సవాలలో ఎలాంటి అవంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తెలుగు లక్ష్మీ, మద్దీశ్వరి, ఎంపీటీసీలు బుగిడి ఈరమ్మ, అత్తవుల్లా, సుశీలమ్మ, నడిపి షేక్ సాహెబ్, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



అమ్మ వార్లకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు



పెద్దమ్మ దేవికి పూజలు చేస్తున్న భక్తులు



కనకవీడులో అమ్మవారి ఆలయం వద్ద భక్తజనం

ఘనంగా వాసవీ మాత జయంతి



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఆదోని అర్బన్: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవికి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, బంగారు ఆభరణాలు, పూల అలంకరణ చేశారు. ఉదయం పల్లకీ ఉత్సవం, 108 మంది మహిళలచే కలశాలను పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం ఆర్యవైశ్య మహిళా మండలి వారిచే కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో డోలు సన్నాయిల మధ్య వాసవీ అమ్మవారి శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, సెక్రటరీ కొట్ర వేణుగోపాల్, ట్రెజరర్ జి.శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ టి.జి.రాంప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీ మాత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం శారదమ్మ, నరసింహయ్య శెట్టి దంపతులు వాసవీ మాత పతావిష్కరణ చేశారు. ఇందులో భాగంగా అమ్మవారికి 102 నారికేళాల నీటితో అభిషేకం, పూజ కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు.

టీకాలు తప్పనిసరి



పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల: గర్భిణులు, పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని సచివాలయంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. తల్లులు తమ పిల్లలకు సమయానుసారంగా వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి హనుమంతు, ఆరోగ్య కార్యకర్త ప్రమీల కుమారి, ఆశ వర్కర్లు అమీనా, మైమూన్, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని లక్ష్మీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఖిబులా కాలనీ సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయకృష్ణ, ఏఎన్‌ఎం దేవమణి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

కౌతాళం: అందరు కలిసికట్టుగా బాల్య వివాహాలను అరికడుదాం అని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యుడు ఇమ్మానియెల్‌రాజు, సిబ్బంది ఉన్నారు.

శ్రీ మఠంలో డీఎస్పీ



మంచాలమ్మకు పూజలు చేస్తున్న డీఎస్పీ

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో డీఎస్పీ ఉపేంద్రబాబు దపంతులు దర్శించుకున్నారు. బుధవారం శ్రీ మఠంలో ముందుగా డీఎస్పీ దంపతులు మంచాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. ఆయన వెంట ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలి మృతి



బడెమ్మ (ఫైల్)

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ ఎంపీటీసీ – 2 సభ్యురాలు చెవుల బడెమ్మ(64) బుధవారం మృతి చెందారు. గత 5 రోజులుగా బడెమ్మ అనారోగ్యంతో బాధపడుతుండేవారు. బుధవారం ఆమె కుమారులు బంధువుల ఊర్లలో జరుగుతున్న దేవరలకు వెళ్లారు. దీంతో పొలంలో ఎవరూ లేకపోవడంతో ఆమె పొలాలనికి వెళ్లింది. పొలంలో ఏదో పని చేస్తూ ఉండగా.. ఎండ తీవ్రతకు నీరసం ఎక్కువ అయ్యి కడుపులో తిప్పినట్లు అయ్యింది. నీళ్లుతాగి పక్కనే ఉన్న చెట్టుకిందికెళ్లి పడుకుని అక్కడే చనిపోయింది. 4గంటల సమయంలో పొలం పక్కన ఉన్న వారు గమనించి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు. బడెమ్మకు నలుగురు కుమారులు పెద్ద వెంకటేష్, చిన్న వెంకటేష్, బజారి, మహాదేవ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్‌కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి విచారం వ్యక్తం చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కోలుకోలేక వ్యక్తి..

నందవరం : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై కోలుకోలేక బోయ చిన్న ఈరన్న (55) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. మండల పరిధిలోని మిట్టసోమపురం గ్రామానికి చెందిన బోయ చిన్న ఈరన్న మంగళవారం గూడూరు మండలం, నాగలాపురం గ్రామంలోని సుంకులమ్మ దేవరకు వెళ్లి తిరిగి వస్తుండగా గుడిపాడు– గూడూరు గ్రామాల మధ్యలో ఆటో నుంచి జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతిడికి భార్య జయలక్ష్మితో నలుగురు కుమార్తెలు ఉన్నారు.

సబ్సిడీ రుణాల్లో దివ్యాంగుల కోటా ఏదీ?

ఆదోని రూరల్: దివ్యాంగులకు కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు దరి చేరడం లేదని, రుణాల ఎంపికలో దివ్యాంగుల ఐదు శాతం వాటా ఏదీ అని ఆదోని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం మండల అధ్యక్షులు పి.హనుమంతరెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, మైనార్టీ తదితర కార్పొరేషన్ రుణా ఎంపికలో కూటమి ప్రభుత్వం దివ్యాంగులను విస్మరించిందన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం సబ్సిడీ, రాయితీ పథకాల్లో దివ్యాంగులకు ఉన్న 5 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయా లని ఉన్నప్పటికీ రుణాల ఎంపికలో 5 శాతం దివ్యాంగులకు కల్పించకపోవడం దారుణమన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన



నల్లగేటు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్, ఆయాశాఖల అధికారులు

ఆదోని టౌన్: పట్టణంలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నల్లగేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే డా.పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, టీపీఓ బాలమద్దయ్య, కౌన్సిలర్‌లు సందీప్‌రెడ్డి, కిషోర్, రైల్వే ఏఈ ఫిరాజ్‌అహ్మద్, తహసీల్దార్ శివరాముడు, ఎంఈ ఇంతియాజ్‌ఆలీ, డీఈ గోపీనాథ్, ఏఈలు జనార్దన్, సాయిసురేష్ తదితరులు బుధవారం స్థల పరిశీలన చేశారు. నల్లగేటు సమీపంలో రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణంతో ఆదోని పట్టణ ప్రజలు తమ గ్రామీణ ప్రాంత రైతుల కష్టాలు తీరనున్నాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల అవసరాలు, వారి సమస్యలను గుర్తించి రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. అవసరమైతే మరో బ్రిడ్జిని కూడా నిర్మిస్తామని చెప్పారు.

ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు విక్రయించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఈగల్ ఎస్ఐ, సిబ్బంది, వన్‌టౌన్ సీఐ

ఆదోని అర్బన్: నార్కోటిక్ మరియు సైకోట్రోపిక్ ఔషధాలను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలని ఈగల్ ఎస్ఐ సుజన్‌కుమార్, ఆదోని వన్ టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. కొన్ని దుకాణాల్లో ఈ మందులు ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని, చట్ట విరుద్ధమన్నారు. బుధవారం ఆదోని సబ్ డివిజన్‌లోని స్థానిక మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఎన్‌ఆర్ఎక్స్ డ్రగ్స్‌పై అవగాహన, విత్ అవుట్ ప్రిస్క్రిప్షన్ ఆఫ్ వాయిలేషన్ ఎన్‌ఆర్ఎక్స్ డ్రగ్స్ గురించి మెడికల్ షాపుల యాజమాన్యంతో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా ఈగల్ ఎస్ఐ, వన్ టౌన్ సీఐ పాల్గొని మాట్లాడారు. ఎన్ఆర్ఎక్స్ ఉల్లంఘటన వల్ల వచ్చే ప్రమాదాల గురించి వారు వివరించారు. రోగుల ఆరోగ్యంపై ప్రభాదం పడుతుందని, మందులపై ఆధారపడే అలవాటు ఏర్పడుతుందని తెలిపారు. సదస్సులో ఆదోని మెడికల్ అసోసియేషన్ మెంబర్స్ శ్రీధర్, రియాజ్, ప్రసాద్, మెడికల్ షాపుల యాజమాన్యం, ఈగల్ సిబ్బంది వై.ఎలీషా, మాసూమ్‌వలీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కౌతాళం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశులు, పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్యలు కోరారు. సీపీఎం మండల కమిటీ సమావేశం చిన్న మారయ్య అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది. వారు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య చాల తీవ్రంగా ఉందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కొన్ని చోట్ల ఫిల్టర్లు పని చేయక పోవడంతో నీరు అలాగే వదులుతున్నారని.. దీంతో ప్రజలకు విరోచనాలు, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. హాల్వి ఎస్ఎస్ ట్యాంకుకు వల్లూరు నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ వేసి అన్ని గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాలన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ ఈరన్న, వీరేష్, చిన్న మారయ్య, ఉరుకుందవీరేష్ పలువురు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై దాడులు

కోసిగి: ఆదోని, ఎమ్మిగనూరు, కోసిగి, ఆలూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యంపై క్రాస్ దాడులు నిర్వహించినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంత రావు తెలిపారు. బుధవారం ఆదోని ఎక్సైజ్ బృందం ఎమ్మిగనూరు స్టేషన్ పరిధిలోని దాడులు నిర్వహించగా.. మాలపల్లి గ్రామానికి చెందిన బోడబండ శివ అనే వ్యక్తి వద్ద నుంచి 40 డిప్స్ ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ మద్యం పట్టుబడినట్లు తెలిపారు. అలాగే కోసిగి ఎక్సైజ్ టీమ్ ఆదోని డివిజన్‌లో దాడులు చేపట్టగా పెసలబండ గ్రామానికి చెందిన మద్దిలేటమ్మ అనే మహిళ వద్ద 20 డిప్స్ పట్టుబడినట్లు చెప్పారు. కోసిగి పరిధిలో కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ టీమ్ దాడులు చేపట్టినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తి వేయాలి

ఆదోని రూరల్: ఎఫ్‌సీఆర్ఏ చట్టం ఆర్‌డీటీ సంస్థపై ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు, ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకప్ప, పెద్దహరివాణం మాజీ సర్పంచ్ ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

కుట్టు శిక్షణ పేరుతో భారీ దోపిడీ



మాట్లాడుతున్న పార్టీ బీసీ విభాగం రాష్ట్ర, జిల్లా నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: బీసీ మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ పేరుతో కూటమి సర్కార్ భారీ దోపిడీకి పాల్పడిందని, ఇందులో రూ.167కోట్ల స్కాం జరిగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు శివప్రసాద్, తాలూకా బీసీ విభాగం అధ్యక్షుడు మురళీనాయుడు ఆరోపించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుట్టు శిక్షణకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.23వేలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఒక్కొక్కరికి మొత్తం రూ.7,300 ఖర్చు అవుతుందన్నారు. ఈ లెక్కన లక్ష మంది మహిళలకు రూ.73కోట్ల మేర ఖర్చు అవుతుందని తెలిపారు. కాగా ఈ శిక్షణకు టెండర్ విలువ రూ.230 కోట్లని, అయితే వాస్తవంగా ఖర్చు అయ్యేది రూ.73 కోట్లు కాగా.. రూ.167 కోట్ల కుంభకోణం జరిగినట్లు బహిరంగంగానే తెలుస్తోందన్నారు. ఇదే తరహాలో కమ్మ, కాపు, ఆర్యవైశ్య, క్షత్రియ కార్పొరేషన్‌ల ద్వారా మరో 50 వేల కుట్టు మిషన్లకుటెండర్లు పిలిచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. ఒక్కో కార్పొరేషన్ నుంచి 10వేల కుట్టు మిషన్‌లకు రూ.115 కోట్ల టెండర్లను పిలిచేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. దీని ప్రకారం వాటిలో కూడా రూ.244.50కోట్ల స్కాం చేసేందుకు భారీ కుట్ర జరుగుతుందని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి మాచాని వెంకటేష్, వైఎస్సార్‌సీపీ తాలూకా యూత్ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, నందవరం మండల పార్టీ అధ్యక్షుడు శివారెడ్డిగౌడ్, పట్టణ నాయకులు రఘువీర, వడ్డే వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల పేరుతో కూటమి ప్రభుత్వం దోపిడీ



కోసిగి తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు

కోసిగి: బీసీల పేరుతో కూటమి ప్రభుత్వం బహిరంగ దోపిడీకి పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాడుగేని నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు ముకుంద కృష్ణమూర్తి ఆరోపించారు. బుధవారం కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రుద్రగౌడలకు వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ , శిక్షణ కోసం ప్రభుత్వం రూ.230 కోట్లు కేటాయించిందన్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు 50 రోజుల పాటు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. శిక్షణకు హాజరైన ప్రతి బీసీ మహిళలకు రూ.3వేల స్టైఫండ్‌తో పాటు శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు ఉచితంగా అందించేలా చర్యలకు పూనుకుందన్నారు. ఇందు కోసం ఒక్కొక్క మహిళకు రూ.23వేల వెచ్చిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే కూటమి పార్టీ నాయకులు అనుకూలమైన వారికి మాత్రమే కుట్టు మిషన్లు కేటాయించి కాంట్రాక్టర్ల ద్వారా భారీ దోపిడికి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శులు బుళ్లి నరసింహులు, గానిగ వీరస్వామి, బండ్ల గోవిందు, వలంటీర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శి పి. వెంకటేష్, బినిగేరి ప్రతాప్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీలక్ష్మి



నియమితులైన వారితో ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీలక్ష్మి, ఆదోని డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా డి.మంజులను నియమిస్తూ పార్టీ అధిష్టానం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డిలకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. శ్రీలక్ష్మి, మంజుల మాట్లాడారు. తమపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయిలో ఒకరు, ఆదోని డివిజన్ స్థాయిలో మరొకరికి పార్టీ బాధ్యతలు కట్టబెట్టిన పార్టీ అధ్యక్షుడు జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. తాము బతికున్నంతవరకు వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతూ పార్టీ పటిష్టత, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడతామన్నారు. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. పార్టీ లో చురుగ్గా ఉంటూ పార్టీ పటిష్టత కోసం శ్రమిస్తున్న శ్రీలక్ష్మి, మంజుల సేవలను గుర్తించి వారికి పదవులను కట్టబెట్టడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగేశ్వరయాదవ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు సాయిరాం, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.


రీ సర్వే పకడ్బందీగా నిర్వహించండి



ముగతిలో రీ సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నందవరం : గ్రామాల్లో రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రీ సర్వేలో అవకతవకలకు తావు ఇవ్వొద్దని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. రీ సర్వేకు రైతులు సహకరించాలని, తమ భూములలో సర్వే నిర్వహించేటప్పుడు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డివిజల్ సర్వేయర్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ అక్బర్ బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఖాదర్‌లింగస్వామి ఉరుసు



విద్యుద్దీపాల వెలుగుల్లో దర్గా



ఉరుసు పోస్టర్లను విడుదల చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్ లింగ స్వామి 321వ ఉరుసు ఉత్సవాలు ఈనెల 9 నుంచి ప్రారంభమై 13వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగానే ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టారు. ఇప్పటికే దర్గా పరిసరాల్లో షామియాలను ఏర్పాటు చేశారు. దర్గాను పూర్తిగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం వివిధ దర్గాల పీఠాధిపతులతో కలిసి ఉరుసు పోస్టర్లను దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చీస్తీ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 9న శుక్రవారం స్వామి సమాధిని సుగంధ పానియాలతో (గుసుల్) శుభ్రచేయడం జరుగుతుందని, 10న శనివారం గంధం, 11న ఆదివారం ఉరుసు వేడుకలు ఉంటాయని తెలిపారు. 12న (సఫ్‌రాలూట్‌నా) స్వామి యొక్క ప్రసాదం పంపిణీ కార్యక్రమం, 13న జియారత్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆదోని టౌన్: వేసవికాలం దృష్ట్యా పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో 70 రోజులకు సరిపడే నీరు నిల్వ ఉన్నాయన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 42 వార్డుల్లో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేత

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శుభ కార్యాలకు తప్పా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయబోమన్నారు. ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు. రాజకీయ నాయకుల సిఫారస్సులు కూడా పరిగణనలోకి తీసుకునే పరిస్థితిలేదని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో వెలసిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలను అర్చకులు నిర్వహించారు. రామకృష్ణ స్వామిచే భక్తులకుతీర్థ ప్రసాదాలు అందించగా గువ్వలదొడ్డి శ్రీనివాసులాచారి, సూర్యనారాయణచారి, క్రిష్ణయ్య ఆచారి, ఉరుకుందాచారి, వీరమోహన ఆచారి తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.